సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 3 | మార్చి | 2023



స్వామికి వెండి అభరణాలు

అయినవిల్లి: మడుపల్లిలో సీతారామ, లక్ష్మణ, హనుమంతుడు, గణపతిస్వామివార్లకు గ్రామానికి చెందిన నిమ్మకాయల వెంకటేశ్వరరావు వెండి ఆభరణాలు సమర్పించారు.




..నైపుణ్యానికి సాధన

తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకెళుతోంది.

- వివరాలు 8లో ▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు గురువారం7,540 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,600,పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

రూ.51.40 లక్షల అపరాధ రుసుం వసూలు

అమలాపురం రూరల్: ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనం నడుపుతున్న వారిపై 1,028 కేసులు నమోదు చేసి రూ.51.40 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామని జిల్లా రవాణా శాఖ అధికారి డి.అశోక్ ప్రతాపరావు తెలిపారు. గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా యువత నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, హెల్మెట్లు ధరించకపోవడం, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

పవర్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



క్యాంపును ప్రారంభిస్తున్న జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు


అమలాపురం టౌన్: అమలాపురంలో ఈ నెల 11,12 తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు గురువారం ఉదయం ప్రారంభించారు. క్యాంపునకు జిల్లా కోచ్‌గా ఎంపికైన ఎంవీ సముద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర పోటీల్లో తలపడే జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఈ నెల 9వ తేదీ వరకూ రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ శిక్షణ ఇస్తారని జిల్లా అధ్యక్షుడు కృష్ణ పద్మరాజు తెలిపారు. జిల్లా కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు ఈ నెల 11,12 తేదీల్లో జరగనున్న రాష్ట్ర పోటీల్లో విజయం సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు నగభేరి కృష్ణమూర్తి, పానకల దుర్గా ప్రసాద్, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, ఎం.భావన, పద్మావతి పాల్గొన్నారు.

అగ్నివీర్ నియామకాలకు ఆన్‌లైన్ పరీక్ష

అమలాపురం రూరల్: అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్ష రిజిస్ట్రేషన్‌కు మార్చి 15 నుంచి వెబ్‌సైట్ తెరిచి ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి నమోదు చేసుకోవాలన్నారు. అగ్నివీర్ ఉద్యోగాల నియామకం రెండు దశల్లో జరుగుతుందన్నారు. మొదటగా కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష 17 ఏప్రిల్ నుంచి మే 4 వరకు నిర్వహిస్తారన్నారు. రెండో దశలో షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు రిక్రూట్‌మెంట్ ర్యాలీ వద్ద నిర్దేశించిన తేదీ, సమయంలో నివేదించాలన్నారు. సైన్యంలో చేరాలనుకునే అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ ఉద్యోగాలకు 10వ తరగతి ఉత్తీర్ణత, అగ్నివీర్ ట్రేడ్‌మాన్ ఉద్యోగాలకు 8 వ తరగతి ఉత్తీర్ణత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

చేనేతల సంక్షేమమే జగన్ సంకల్పం

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

సీటీఆర్ఐ: చేనేత కార్మికులకు మేలు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల చేనేత సహకార సంఘాల అధ్యక్షులతో గురువారం రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చేనేత సొసైటీ అధ్యక్షులతో మాట్లాడి వారు తయారు చేస్తున్న ఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అన్నారు. 75 ఏళ్ల దేశ చరిత్రలో చేనేతలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించిన ఘనత సీఎం జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులకు పంటగ



ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం వద్ద కూనవరం మేజర్ డ్రెయిన్‌పై నిర్మించిన క్రాస్‌బండ్

- రబీ నీటిఎద్దడి నివారణకు చర్యలు
- శరవేగంగా క్రాస్‌బండ్ల నిర్మాణం
- 3 టీఎంసీల నిల్వకు అవకాశం
- రూ.3.45 కోట్ల కేటాయింపు
- అన్నదాతల హర్షాతిరేకాలు

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ నీటిఎద్దడి నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. దీనివల్ల మురుగునీటి కాలువల్లో నీటిని సంవృద్ధిగా నిల్వ చేసి చేలకు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గోదావరి డెల్టాలో రబీ నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం రూ.11.67 కోట్లు కేటాయించింది. దీనిలో కీలకమైంది మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్ (అడ్డుకట్ట)ల ఏర్పాటు. దీనికి గాను ప్రభుత్వం రూ.3,45,37,000 కేటాయించింది. మొత్తం 44 పనులకు అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే డ్రెయిన్స్ అధికారులు ఆగమేఘాలపై పనులు ఆరంభించి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. 44 పనులకు గాను మొత్తం 189 చోట్ల క్రాస్‌బండ్‌లను నిర్మించనున్నారు. మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లపై వీటి నిర్మాణం వేగంగా సాగుతోంది. ఇప్పటి వరకు 112 చోట్ల క్రాస్‌బండ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.

- రాజోలు సబ్ డివిజన్ పరిధిలో ఎనిమిది పనులకు రూ.72 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో 44 క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేశారు. మీడియం, మైనర్ డ్రెయిన్లపై నిర్మాణాలు చేశారు. మామిడికుదురు మండలంలో ఏడు క్రాస్‌బండ్‌ల నిర్మాణం చేపట్టారు. కొత్తపేట, ఆత్రేయపురం మండలంలో రెండు నిర్మిస్తున్నారు.
- అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో కూనవరం, దేశకోడు, వృద్ధ గౌతమీ, అమలాపురం మేజర్ డ్రెయిన్లపై క్రాస్‌బండ్ల నిర్మాణం జరిగింది. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో ఏడు మండలాల పరిధిలో 83 క్రాస్‌బండ్‌లు మంజూరు కాగా 67 నిర్మాణాలు పూర్తి చేశారు.
- రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో 66 క్రాస్ బండ్‌ల నిర్మాణాలకు అనుమతి లభించగా, ఇప్పటి వరకు 24 వరకు పూర్తయ్యాయి. కె.గంగవరం మండలంలో అత్యధికంగా 43 మంజూరు కాగా ఇప్పటి వరకు 15 చోట్ల నిర్మాణాలు పూర్తి చేశారు.

మూడు టీఎంసీల నిల్వ

క్రాస్‌బండ్‌ల నిర్మాణం ద్వారా మురుగునీటి కాలువల్లో వృథాగా పోయే సుమారు మూడు టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశముందని అంచనా. మార్చి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు రబీ సీజన్‌లో జిల్లాలోని మురుగునీటి కాలువల ద్వారా రెండు టీఎంసీల నీరు మోటార్ల ద్వారా చేలకు మళ్లించనున్నారు. ఒక టీఎంసీ ద్వారా సుమారు 10,800ల ఎకరాల చొప్పున 21,600 ఎకరాల పంటను పండించవచ్చు. గోదావరిలో సహజ జలాలు తగ్గుతున్న సమయంలో క్రాస్‌బండ్‌ల ద్వారా మూడు టీఎంసీల నిల్వ చేయడం అభినందనీయమని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూనవరం క్రాస్‌బండ్‌తో బహుళ ప్రయోజనాలు

కూనవరం మేజర్ డ్రెయిన్‌పై ఎస్.యానం వద్ద రూ7.40 లక్షలతో క్రాస్‌బండ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల సముద్రపు పోటు సమయంలో ఉప్పునీరు పంట పొలాల్లోకి ప్రవేశించకుండా చేయడంతో పాటు డ్రెయిన్‌లో వృథాగా పోతున్న నీటిని నిల్వ చేయవచ్చు. ఈ డ్రెయిన్‌కు అనుబంధంగా ఉన్న మైనర్, మీడియం, రెవెన్యూ డ్రెయిన్లలో నిల్వ ఉండే నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా చేలకు తరలిస్తున్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లో సుమారు 6 వేల ఎకరాల్లో పంటలను కాపాడుకునే అవకాశం ఏర్పడింది.



మలికిపురం మండలం వేపచెట్టు డ్రెయిన్‌పై పూర్తయిన క్రాస్‌బండ్



వృద్ధగౌతమీ మేజర్ డ్రెయిన్‌పై నిర్మించిన క్రాస్‌బండ్

వైఎస్సార్ హయాంలో శ్రీకారం

డెల్టా మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌ల ఏర్పాటుకు 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి నాలుగుసార్లు మినహా ఏటా రబీకి నీటి ఎద్దడి ఏర్పడడం... క్రాస్‌బండ్‌ల నిర్మించడం పరిపాటిగా మారింది. 2009లో రబీకి నీటి ఎద్దడి వచ్చిన సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో సీలేరు, కిన్నెరసాని నుంచి అదనపు నీటిని సేకరించారు. ఇది కాకుండా గోదావరి నీటిని పంట కాలువల్లోకి పంపులు ఏర్పాటు చేసి తోడారు. వీటితో పాటు క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేసి డీజిల్ మోటార్లతో చేలలోకి, పంట కాలువల్లోకి నీరు తోడారు. ఇలా తొమ్మిది టీఎంసీల నీటిని అదనంగా సేకరించడం ద్వారా నాడు రబీ పంటను గట్టెక్కించారు. నాటి నుంచి డెల్టాలో రబీకి నీటి ఎద్దడి ఏర్పడినప్పుడల్లా అప్పట్లో నిర్మించిన ప్రాంతాల్లోనే క్రాస్‌బండ్‌ల నిర్మాణం చేపడుతున్నారు.

సాగునీటి ఎద్దడి రానివ్వం



జిల్లాలో రబీ నీటికి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. అనుకున్నదాని కన్నా వేగంగా క్రాస్‌బండ్‌ల నిర్మాణం చేపట్టాం. కూనవరం మేజర్ డ్రెయిన్‌పై క్రాస్‌బండ్ నిర్మాణం వల్ల ఆరువేల ఎకరాల ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలుగుతోంది. రబీ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు



బిళ్లకుర్రులో అమృత సరోవరం చెరువును పరిశీలిస్తున్న పీడీ మధుసూదనరావు

కొత్తపేట: జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద లక్ష్యాన్ని మించి పనులు పూర్తిచేసినట్టు డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలిపారు. మండల పరిధిలోని బిళ్లకుర్రు గ్రామంలో అమృత సరోవరం పథకం కింద సుందరీకరించిన పంచాయతీ చెరువును పీడీ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో పనుల వివరాలు, పురోగతి తదితర అంశాలు పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ కింద 2022–23 సంవత్సరంలో తొలుత 30 లక్షల పనిదినాలు, తరువాత మరో 42 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా వాటిని పూర్తి చేశామన్నారు. మళ్లీ 123.32 కోట్ల విలువ గల 62 లక్షల పనిదినాలతో 1,860 పనుల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. వాటిలో ఇప్పటికి 50.50 లక్షల పనిదినాల పూర్తిచేశామన్నారు. సగటు వేతనం రూ.244 చెల్లించడం ద్వారా కోనసీమ జిల్లా.. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 2023–24 సంవత్సరానికి సుమారు రూ.130 కోట్ల విలువ గల 64 లక్షల పనిదినాలతో 13,552 పనులు నిర్దేశించినట్టు తెలిపారు. అమృత సరోవరం పథకం కింద జిల్లాలో చెరువుల ఆధునీకరణ, సుందరీకరణ జరుగుతోందన్నారు. కనీసం ఒక ఎకరం విస్తీర్ణంలో 10 వేల క్యూబిక్ మీటర్లు నీరు నిల్వ చేసి, గట్టును బలపర్చి, వాకింగ్ ట్రాక్, బెంచీలు ఏర్పాటు చేసి, మొక్కలు పెంచుతున్నామని చెప్పారు. ఈ పథకం కింద జిల్లాలో 75 చెరువులు గుర్తించగా 11 చెరువులను సుందరీకరించామన్నారు. 17 చెరువుల పనులు జరుగుతున్నాయన్నారు. బిళ్లకుర్రు సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు, అమృత సరోవరం జిల్లా కోఆర్డినేటర్ ఎం.త్రినాథ్, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, పాల్గొన్నారు.

‘జగనన్న భూరక్ష’ చరిత్రాత్మకం

ఆర్‌డీఓ ముక్కంటి

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న భూరక్ష దశ స్వాతంత్ర్య చరిత్రలో చరిత్రాత్మకంగా నిలిచిందని కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి అన్నారు. మండలంలోని పెదపళ్ల, మోదుకూరు, గుమ్మిలేరు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి సరిహద్దు రాళ్ల ఏర్పాటుపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే భూసర్వే పూర్తికావడంతో రాళ్లు పూర్తిస్థాయిలో సరఫరా చేసి కూలీల సాయంతో ప్రధాన, పుంత రోడ్ల వెంబడి ఉన్న ప్రాంతాలకు తరలించామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ప్రతి రైతుకు సంబంధించిన పొలాల సరిహద్దులను గుర్తించామన్నారు. పొరపాటున సర్వే నంబరుకు అనుగుణంగా భూమి లేకపోతే పరిసరాల్లో ఉన్న భూములను మరోసారి సర్వే చేస్తామన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు నెక్కంటి ప్రమీత, బొబ్బా వెంకన్న, జాస్తి భాస్కరరావు, యన్నన బుజ్జి, ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య పాల్గొన్నారు.



పెదపళ్లలో సరిహద్దు రాళ్లు ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

బరి తీగింపునకు అడ్డుకట్ట

సాక్షి ఇంపాక్ట్

- అనధికార చెరువులకు విద్యుత్ కనెక్షన్ తొలగింపు
- కరెంట్ సరఫరాకు సహకరించిన రైతుకు నోటీసులు

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలోని 32 ఎకరాల్లోని డీ పట్టా భూముల్లో అనధికార ఆక్వా సాగుకు అక్రమ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుపై గురువారం ‘సాక్షి’దినపత్రికలో ‘మరీ బరితీగింపు’ శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, మత్స్య, ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఆఘమేఘాలపై కదిలారు. ఎస్.రామేశ్వరంలోని ప్రభుత్వ భూముల్లో అనధికార చెరువులకు ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను ఏపీఈపీడీసీఎల్ డీఈ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తొలగించారు. డీపట్టా భూములకు విద్యుత్ సరఫరాకు సహకరించిన సామంతకుర్రుకు చెందిన ఆక్వా రైతుకి నోటీసులు జారీ చేశారు. డీపట్టా భూములకు విద్యుత్ సరఫరా చేస్తే విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తామని రైతుని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లో అనధికారంగా సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన రైతు కృష్ణంరాజు నుంచి అనుమతులు లేని డీపట్టా భూముల్లో ఆక్వా సాగు చేయబోనని లిఖిత పూర్వకంగా హామీ తీసుకున్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్వా సాగుకు ప్రయత్నించినా, అనధికారికంగా విద్యుత్‌ను వాడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను లీజుకి ఇచ్చేందుకు గ్రామ పెద్దలకు అధికారం ఎవరిచ్చారని అధికారులు గ్రామస్తులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖాధికారి హేమానంద్, ఏడీ అన్నవరం, ఏఈ సూర్యనారాయణ, వీఆర్‌ఓ సతీష్, మత్స్యశాఖ సహాయకులు నరసింహ పాల్గొన్నారు.



అనధికార చెరువుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్ తొలగించిన అధికారులు

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి



కొవ్వూరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న హోమ్ మంత్రి వనిత



కొవ్వూరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

- రాష్ట్ర హోం మంత్రి వనిత పిలుపు
- అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం : బోస్
- ప్రాధాన్యత క్రమంలో ఓటింగ్ జక్కంపూడి రాజా

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పార్టీ తరఫున పోటీలో ఉన్న వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌ల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. పట్టణంలో క్యాంపు కార్యాలయంలో గురువారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు పార్టీ విధేయులుగా పనిచేయాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును కవురు శ్రీనివాస్‌కు, ద్వితీయ ప్రాధాన్యత ఓటును రవీంద్రనాథ్‌లకు వేయాలని సూచించారు. గెలిచే అవకాశం లేదని తెలిసినా ప్రతిపక్షాలు నామినేషన్‌లు దాఖలు చేశాయన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరిచిపోరనడానికి ఎమ్మెల్సీ అభ్యర్థులే నిదర్శనం అన్నారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట

అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ పరిశీలకుడు, ఎంపీ సుభాష్ చంద్ర బోస్ పేర్కొన్నారు. బడుగు,బలహీన వర్గాలతోపాటు కీలకమైన కాపు సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. అంబేడ్కర్ ఆశించిన సామాజిక వ్యవస్థను ముఖ్యమంత్రి కార్యరూపంలో అమలు చేసి చూపించారన్నారు. 60శాతం పైగా బీసీలకు చట్టసభల్లో స్థానం కల్పించారన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో ఓటు

పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ప్రాధాన్యతాక్రమం ప్రకారం ఓటు వేసి గెలిపించాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజానగరం శాసనసభ్యుడు జక్కంపూడి రాజా సూచించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన వ్యక్తులను అభ్యర్థులుగా ఎంపిక చేయడం మంచి పరిణామమన్నారు. జిల్లా సమస్యలపై శాసన మండలిలో గళం విప్పేవారికి అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పార్టీకి నిబద్ధతతో ఓటు వేయాలని సూచించారు.

ఓటింగ్‌పై అవగాహన

పార్టీ శాసనమండలి అభ్యర్థి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఓటింగు విషయంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. సందేహాలుంటే నివృత్తి చేస్తామన్నారు. మరో అభ్యర్థి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న తమకు సముచిత స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సామాజిక సమతుల్యతను పాటిస్తూ జిల్లాలో కాపు,బీసీ వర్గాలకు న్యాయం చేశారన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు,రాష్ట్ర పరిశ్రమలు,మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి,ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ(నారాయుడు), జొన్నకూటి పోసిబాబు, మట్టా వీరస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్,రాష్ట్ర ఎంపీటీసీ సంఘం మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు పాల్గొన్నారు.

4లోపు ఈ కేవైసీ

కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: జిల్లాలో రబీ సాగుకు సంబంధించి వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 6,979 ఎకరాలకు ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉందని, వీరు మార్చి 4వ తేదీలోపు తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 1,77,313 ఎకరాలలో సాగు చేయగా 1,69,876 ఎకరాలకు సంబంధించిన రైతులు మాత్రమే ఈ కేవైసీ చేయించుకున్నారని పేర్కొన్నారు. గ్రామ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలన్నారు. సామాజిక తనిఖీ మార్చి 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తారని, క్షేత్రస్థాయి ఫిర్యాదుల పరిశీలన మార్చి 13 నుంచి 17 వరకు జరుగుతుందని, మార్చి 20న తుది జాబితా ప్రదర్శిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ ఇల్లు గ్రామ వార్డు సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. వీటిని స్టేజ్ కన్వర్షన్ ద్వారా పూర్తి చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శుక్లా పాల్గొన్నారు. గృహ నిర్మాణాలు, ఇళ్ల స్థల పట్టాల పంపిణీ, రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయ, ఉద్యాన, పశు,సంవర్థక, జగనన్న పాల వెల్లువ కార్యక్రమాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ సత్తిబాబు, సీపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు చంటిబాబు, కృష్ణారెడ్డి, కె.నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానఅధికారి ఎస్.మల్లికార్జునరావు, హౌసింగ్ పీడీ ఎం.బాబూరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా

క్లుప్తంగా

లీల అంత్యక్రియలు పూర్తి

కాకినాడ క్రైం: లీలా పవిత్ర అంత్యక్రియలు గురువారం ఉదయం ముగిశాయి. కుటుంబీకుల కన్నీటి రోదనల మధ్య, పోస్టుమార్టం అనంతరం, లీల మృతదేహానికి బెంగళూరులోని స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం లీల తల్లిదండ్రులు తమ బంధువులతో కలిసి కారులో బయల్దేరి గురువారం సాయంత్రానికి రాజమహేంద్రవరం చేరుకొని అక్కడి నుంచి తమ బంధువుల ఇంటికి గంగ్రేడుకు బయల్దేరి వెళ్లారు.

నకిలీ పోలీసుల అరెస్టు

పిఠాపురం: పోలీసులమని చెప్పి దోపిడీకి పాల్పడిన నలుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్లు పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. క్రైం పార్టీ పోలీసులమని చెప్పి కేదారశెట్టి వెంకటరమణ అనే వ్యక్తి దగ్గర నుంచి రూ.50 వేలు దోచుకున్న వి.వంశీకృష్ణ, జీవీ చందు, ఎం.కిరణ్, వై.శివను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి రూ.50వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

లోకో, అసిస్టెంట్ లోకో పైలెట్లపై వేధింపులు తగవు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వేలోని లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు ప్రశాంతంగా విధులు నిర్వహించుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డీఎంఆర్‌కేఎస్ జోనల్ సెక్రటరీ కేవీ ఉన్నికృష్ణన్, ఏఐఎల్‌ఆర్ఎస్ఏ ఆర్గనైజేషన్ సెక్రటరీ కె.రవిశంకర్, ఎస్‌సీఆర్‌ఈఎస్ సెక్రటరీ జేడీ ప్రసాద్ అన్నారు. ఉన్నతాధికారుల వేధింపులను నిరసిస్తూ గురువారం రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జేఏసీ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లకు పనిఒత్తిడి లేకుండా చూడాలన్నారు. ఒక లోకోపైలెట్ ఆత్మహత్య అనే ఆలోచనకు వెళ్లడం బాధ కల్గించిందని, అందుకే ఇలాంటి ఘటనలు జరగకూడదనే జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడినట్లు వివరించారు.

బోధనపై శోధన.. నైపుణ్యానికి సాధన

- తరగతి గదులు పరిశీలిస్తున్న సర్టిఫైడ్ అబ్జర్వర్స్
- 'సాల్ట్' ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం చేయూత
- 5,936 యాప్ బేస్డ్ టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ లక్ష్యం


తరగతి గదిలో టీచ్ టూల్ సర్టిఫైడ్ అబ్జర్వర్

రాయవరం: తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకెళుతోంది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు నిర్వహణలో రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో టీచ్ టూల్ పేరుతో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధ్యయనం చేస్తున్నారు. కాలానుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఎస్‌సీఈఆర్‌టీ పలు పద్ధతులను అధ్యయనం చేస్తోంది. టీచింగ్ ఎబిలిటీస్ ఎలా ఉన్నాయి? టీచర్‌కు, విద్యార్థికి మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ ఉపయోగపడుతున్నాయి. గతంలో పరిశీలనాంశాలను మాన్యువల్‌గా నమోదు చేయగా, ఇప్పుడు డిజిటల్ బేస్డ్‌గా యాప్‌లో నమోదు చేస్తున్నారు.

424 మంది అబ్జర్వర్స్‌కు శిక్షణ

ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ క్వాలిటీ లెర్నింగ్(గుణాత్మక విద్య) లక్ష్యంగా సాల్ట్ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. టీచ్ టూల్ ద్వారా సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలన చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా నుంచి శిక్షణ పొందిన 25 మంది మాస్టర్ ట్రైనీలు జిల్లా స్థాయిలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రామచంద్రపురం, అన్నవరం, జగ్గంపేటల్లో రెండు బ్యాచ్‌లుగా సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ విధంగా తూర్పుగోదావరి నుంచి 167, కాకినాడ జిల్లా నుంచి 160, కోనసీమ జిల్లా నుంచి 97 మంది సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌కు శిక్షణ పొందారు. ఒక్కో బ్యాచ్‌లో 45 మందికి 10 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. గతేడాది ఆగస్టు, డిసెంబర్‌లో రెండు దశల్లో సర్టిఫైడ్ అబ్జర్వర్స్ శిక్షణ పొందారు. సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలనా సమయంలో బిహేవియర్స్ స్కిల్స్ ఎలా ఉంటాయి? బిహేవియర్స్ స్కిల్స్‌కు కోడ్స్ ఎలా ఇవ్వాలి? తదితర విషయాలపై శిక్షణ పొందారు. శిక్షణ పొందిన అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలించిన ఫీడ్ బ్యాక్‌ను తీసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. నమోదైన అంశాలు యాప్ ద్వారా గుర్తించి, టీచింగ్‌లోని లోటుపాట్లను సరిచేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ, ఎల్ఎఫ్ఈ కలిసి టీచర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కోర్సులు తయారు చేసి టీచర్స్‌కు శిక్షణ ఇస్తారు. రాష్ట్ర విద్యాశాఖతో పాటుగా లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

5,936 తరగతి గదుల పరిశీలన

ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక్కో సర్టిఫైడ్ అబ్జర్వర్ 14 తరగతి గదుల్లోని ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను టీచ్ టూల్స్ ద్వారా పరిశీలన చేస్తారు. ఈ విధంగా 5,936 ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పరిశీలించి టీచ్ ఏపీ యాప్‌లో నమోదు చేస్తారు. అబ్జర్వర్స్ టీచ్ టూల్ నివేదికలను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి(ఎస్ఈసీఆర్‌టీ)కి పంపిస్తున్నారు. ఫిబ్రవరి 15 నుంచి టీచ్ టూల్ అబ్జర్వేషన్ ప్రారంభం కాగా ఏప్రిల్ నెలాఖరులోగా అబ్జర్వర్స్‌కు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంది.



బోధనా పద్ధతుల మెరుగుకు



టీచ్ టూల్ ద్వారా బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోవచ్చు. ఉపాధ్యాయుడు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌కు ఉపకరించే విధంగా టీచ్ టూల్ రూపొందించారు.

– ఆషిక్ అలీబేగ్, ప్రాజెక్టు అసోసియేట్ ఫర్ లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, రాజమహేంద్రవరం

సద్వినియోగం చేసుకోవాలి



టీచ్ టూల్ ప్రోగ్రామ్‌ను సమర్థంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయులు టీచ్ టూల్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.నాగమణి, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, కాకినాడ

భీమవరం బస్టాండ్‌లో వ్యక్తి మృతి


మృతుడు దుర్గాప్రసాద్

నల్లజర్ల: దూబచర్ల శివారు కొత్తగూడెంకు చెందిన సీతాదుర్గాప్రసాద్(42)గురువారం మధ్యాహ్నం భీమవరం బస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతనికి భార్య జ్యోతికుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 15ఏళ్ల క్రితం భార్య పని నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. ఈవిషయంపై భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భార్య పుట్టింటి వద్దే పిల్లలతో ఉంటోంది. ఆమె గల్ఫ్ నుంచి తిరిగి వచ్చాక భర్తపై భీమవరం కోర్టులో మనోవర్తి కేసు ఫైల్ చేసింది. దానికి హాజరయ్యేందుకు బుధవారం రాత్రి ఉండిలో ఉన్న సోదరి ఇంటికి వెళ్లి ఉదయాన్నే కోర్టుకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం12 గంటల సమయంలో భీమవరం బస్టాండ్‌లో జంగారెడ్డిగూడెం బస్ కోసం వేచి ఉండగా ఫిట్స్ రావడంతో పడిపోయాడని డ్యూటీలో ఉన్న కంట్రోలర్ పోలా రత్నకుమార్ మృతుడు దుర్గాప్రసాద్ తెలిపారు. అతనికి సపర్యలు చేయడంతో లేచాడని, 12.30కి మళ్లీ రెండోసారి ఫిట్స్ రావడంతో 108కు సమాచారం ఇచ్చామని చెప్పారు. వారు వచ్చే లోపే ప్రాణాలు పోయాయని బంధువులకు వివరించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్, ఫోన్‌నంబరు ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి రామలక్ష్మి మాత్రం తన కొడుకును అత్తింటి వారే ఆస్తి కోసం చంపేశారంటూ నల్లజర్లలో విలేకర్ల వద్ద ఆరోపించింది. దీనిపై భీమవరం పోలీసులు విచారణ చేపట్టారు.

అవి పులి అడుగులు కావు

అటవీ శాఖ అధికారుల నిర్ధారణ

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం గ్రామ శివారున పంట పొలంలో పులి సంచారం వదంతులపై అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. అవి పులి అడుగులు కాదని, హైనా లేదా రేసుకుక్కల పాదముద్రలని తేల్చారు. వివరాల ప్రకారం గ్రామ శివారున పంట పొలంలో రైతులు పులి పాదముద్రలు పోలిన ముద్రలు కనిపించడంతో రైతులు ఆందోళన చెందారు. తమ పంట పొలాల్లో పులి సంచరిస్తోందంటూ ఆందోళన చెందడంతో గురువారం అటవీశాఖ అధికారులు ఆ పాదముద్రలను పరిశీలించారు. ఈ పాదముద్ర పులికి సంబంధించినది కాదని హైనా కానీ రేసుకుక్కలకు సంబంధించిదిగా తేల్చారు. అనంతరం స్థానిక సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి రైతులకు పాదముద్రలపై అవగాహన కల్పించి వదంతులు నమ్మవద్దని సూచించారు. అటవీశాఖ అధికారులు ఎం.సుబ్బయ్యమ్మ, పి.వెంకట్రావు, ఎం.వెంకట్రావు, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


అచ్యుతాపురంలోని పంట పొలంలో రైతులు గుర్తించిన అడవి జంతువు పాదముద్ర


పంట పొలంలో పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

భర్త, అత్తలపై వరకట్న వేధింపుల కేసు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామానికి చెందిన జి.ప్రశాంతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త, ఇతర కుటుంబ సభ్యులపై పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన ప్రశాంతికి హైదరాబాద్‌కు చెందిన కె.రాజశేఖర్‌తో ఏడాది క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా భర్త, అత్త, ఇతర కుటుంబ సభ్యులు అదనంగా కట్నం కావాలని వేధిస్తున్నారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ టి.సునీత తెలిపారు.

నరసన్న కల్యాణోత్సవాలు ఆరంభం

- మొదటి రోజు పుట్టమన్న సేకరణ, అంకురార్పణ, ధ్వజారోహణ
- నేడు రథోత్సవం, కల్యాణం

మధురపూడి: కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేడుకలు ఆరంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఈ నెల ఎనిమిదవ తేదీ వరకు నిర్వహించే కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దత్తత దేవస్థానమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు గురువారం స్థానిక దేవుని కోనేరు నుంచి పుట్ట మన్ను సేకరించారు. పండితులు అంకురార్పణ, ధ్వజారోహణము, గ్రామ బలిహరణ, సేవాకాలం నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

శుక్రవారం ఉదయం స్వామివారి ఆలయ తలుపులు తెరచి, ఆరాధన చేసి, సర్వ దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 8–30 గంటలకు గ్రామ బలి హరణ. 9 గంటలకు సేవాకాలం అర్చకులు నిర్వహిస్తారు. అనంతరం తీర్థ గోష్ఠి సాగుతుంది. స్వామివారు, అమ్మ వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి, మధ్యాహ్నం 1–56 గంటలకు పల్లకీపై తోడ్కొని వెళ్లి రథంపైకి వేంచేపు చేస్తారు. రథోత్సవం అనంతరం శ్రీ లక్ష్మీదేవి, స్వామివార్లు మంగళస్నానాలను ఆచరించి, పట్టు వస్త్రాలంకరణ ధారులై పెండ్లి పీటలపై కూర్చుంటారు. రాత్రి 9 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం నిర్వహిస్తారు.

250 మంది భక్తుల మాలధారణ

స్వామివారి ఉత్సవాల సందర్భంగా 250 మంది మాలధారణ చేశారు. వీరంతా గత నెల 26 తేదీన మాల ధరించారు. ఈ నెల 4 వ తేదీ వరకు దీక్షలో ఉంటారు. రథోత్సవం, కల్యాణంలో ప్రత్యేక పాత్రను నిర్వహిస్తారు.


పుట్టమన్నును తీసుకొస్తున్న అనువంశిక ధర్మకర్త రంగరాజ భట్టర్, అన్నవరం ఆలయ అధికారులు

తీర్థానికి ఏర్పాట్లు పూర్తి

కోరుకొండ తీర్థానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. స్వామి వారి దర్శనం చేసుకునే భక్తులకు సౌకర్యవంతంగా బారికేడ్లు, క్యూ లు ఏర్పాటుచేశారు. వైద్య,ఆరోగ్యం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, తాగునీటి శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. కొండపైన, కింద రక్షిత మంచినీటిని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా చేశారు.

దేవుని కోనేరు వద్ద ఏర్పాట్లు

శుక్రవారం తీర్థానికి వచ్చే భక్తులు ఉదయమే దేవుని కోనేరులో స్నానమాచరిస్తారు. కోరుకొండ పంచాయతీ, మండల ప్రజాపరిషత్ అధికారులు ఏర్పాట్లు చేశారు. కోనేరు చుట్టూ కంచె, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అక్కడ మహిళలకు రూమ్‌లు నిర్మించారు.

భారీ బందోబస్తు

కల్యాణోత్సవాలకు 217 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కోరుకొండలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తీర్థం సందర్భంగా 217 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారన్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇన్‌చార్జి సీఐ రాజీ విశ్వనాథ్, కోరుకొండ ఎస్సై శారదా సతీష్ పాల్గొన్నారు.


విద్యుత్ వెలుగుల్లో కోరుకొండ దేవస్థానం

తీర్థం కళ కళ

కోరుకొండ తీర్థం పలు దుకాణాలతో కళకళలాడుతోంది. చిన్న చిన్న హోటల్స్, పండ్లు, పూలు, బొమ్మలు విక్రయించే దుకాణాలు జనంతో తాకిడితో సందడిగా ఉన్నాయి.





ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు నన్నయ జట్టు


నన్నయ యూనివర్సిటీ జట్టుతో కళాశాల చైర్మన్ తదితరులు

అమలాపురం రూరల్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సపక్ తక్ర మెన్ చాంపియన్ –2023 పోటీలు ఈ నెల 6 నుంచి 9 వరకు మణిపూర్‌లో జరుగనున్నాయి. ఈ పోటీలలో నన్నయ యూనివర్సిటీ జట్టు పాల్గొంటుందని ఎస్‌కేబీఆర్ ప్రిన్సిపాల్ కుమార్‌శాస్త్రి తెలిపారు. గత నెలలో ఎస్‌కేబీఆర్ కళాశాలలో నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేసి వారం రోజులుగా శిక్షణ ఇచ్చారు. కోచ్ యండ్రా గౌతమ్, సీనియర్ క్రీడాకారుడు కేతా సాయి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని పాలకమండలి చైర్మన్ సుబ్బరాజు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ క్రీడాకారులకు సూచించారు.

మండపేటలో 21.6 కిలోల గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

మండపేట: స్థానికంగా గంజాయి నిల్వ చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 21.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాల మేరకు ఏడిద రోడ్డులోని ఆయిల్ ఫ్యాక్టరీకి వెళ్లే రోడ్డులోని రేకుల షెడ్డులో గంజాయి ఉన్నట్టు అందిన సమాచారం మేరకు రూరల్ సీఐ పి.శివగణేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఘటనా స్థలంలో వై.సీతానగరానికి చెందిన కసిరెడ్డి పెదకాపు, మోదుకూరుకు చెందిన చింతపల్లి సురేష్, రావులపాలెంకు చెందిన బోండాడి రాంబాబును అరెస్టుచేసి వారి వద్ద నుంచి గంజాయి, మూడు మద్యం బాటిళ్లు, ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి గురువారం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి వారికి ఎక్కడ నుంచి వచ్చింది, ఎవరెవరు తీసుకువెళుతున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివకృష్ణ తెలిపారు. ఈ దాడిలో మండపేట డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ఎస్ గాయత్రిపద్మ, వీఆర్‌ఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీస్, రెవెన్యూ అధికారులు

వైనాట్ షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తాళ్లపూడి: గత 29 సంవత్సరాలుగా వైనాట్ సంస్థ ద్వారా ఖాతాదారులకు వివిధ ప్రాంతాల్లో మంచి నమ్మకమైన సేవలను అందజేయడం గొప్ప విషయం అని సామ్‌సంఘ్ కంపెనీ డిప్యూటి జనరల్ మేనేజర్ ఎంవీ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ప్రక్కిలంకలో గురువారం 29వ వైనాట్ షోరూం నూతన బ్రాంచిని ప్రారంభించారు. డాక్టర్ జమ్ముల మృదుల, డాక్టర్ భానుప్రసాద్, ఎంవీ కృష్ణమూర్తి షోరూం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచి ఎండీ జుజ్జవరపు వెంకట రాయుడును పలువురు అభినందించారు. ఎలక్ట్రానిక్ వస్తువులపై పలు ఆఫర్లను అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎల్‌జీ బ్రాంచి మేనేజర్ పి.కిషోర్, హైయర్ మేనేజర్ అరవింద, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాబాలో విజిలెన్స్ దాడులు


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

గండేపలి: మండలంలోని నీలాద్రిరావుపేట పరిధిలో గల రుచి దాబాలో గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎంఎస్‌ఓ జీఎంఎం క్రిష్ణ తెలిపారు. ఇళ్లలో ఉపయోగించే సిలిండర్లను తమ వ్యాపార నిమిత్తం అక్రమంగా దాబాలో వంటలకు ఉపయోగిస్తున్నందున విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయిస్ అధికారులు సీఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది దాడులు నిర్వహించి పది గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వీటిని సమీపంలో గల భారత్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించి దాబా యజమాని పాలచర్ల వెంకటరమణపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడులలో స్వాధీనం చేసుకున్న పది సిలిండర్లలోను మూడు గ్యాస్‌తో నింపి ఉన్నాయని, ఏడు సిలిండర్లు గ్యాస్ వాడేసినవని పేర్కొన్నారు. కిర్లంపూడి మండలం సోమవారం గ్రామంలో గల భారత్ గ్యాస్ ఏజెన్సీ యజమాని రాజా వద్ద వీటిని కొనుగోలు చేసినట్టు తెలియజేశారు.